
సాక్షి బాపట్ల

శనివారం । 2 । మార్చి । 2024



పోలీస్ కుటుంబాలకు చెక్కులు

నగరంపాలెం: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఫ్లాగ్ ఫండ్ రూ.75 వేలు, కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్కు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 516.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ కుడికాలువకు 6,006 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా శోభన్ బాబు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య కె శోభన్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, మ్యాథమెటిక్స్ విభాగం ఆచార్యులుగా పనిచేశారు.



న్యూస్‌రీల్

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు తాగు నీటి అవసరాల నిమిత్తం కృష్ణానది యాజమాన్య బోర్డు ఈఈ రఘునాథ్‌రావు, డీఈ గాయత్రి పర్యవేక్షణలో శుక్రవారం నీటిని విడుదల చేశారు. కుడి కాలువకు 5, 7వ గేటు ద్వారా ఉదయం 10.30 గంటలకు గేటుకు 1,000 క్యూసెక్కుల చొప్పున రెండు గేట్ల ద్వారా 2వేల క్యూసెక్కులను విడుదల చేశారు. కుడి కాలువకు గంటకు 2 గేట్ల ద్వారా 2,000 క్యూసెక్కుల చొప్పున పెంచుతూ మధ్యాహ్నం 1.30 గంటలకు 6,000 క్యూసెక్కులను విడుదల చేశారు. 9 రోజుల పాటు నీటి విడుదల కొనసాగుతుందని సాగర్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్ ప్రాజెక్టు ఈఈ శ్రీహరి, డీఈ మురళీధర్, జేఈలు బాబుమియా, సుధ, సాగర్‌ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సంక్షేమానికి గ్రీవెన్స్ డే



నగరంపాలెం: పోలీస్ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పలువురు ఉద్యోగులు, మినిస్టీరియల్ సిబ్బందితో మాట్లాడారు. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పలువురు వ్యక్తం చేసిన సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలపై పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

రేపటి వరకు ఈ-క్రాప్‌పై సామాజిక తనిఖీ

కొరిటిపాడు(గుంటూరు): రబీకి సంబంధించిన ఈ-క్రాప్ నమోదుపై ఆదివారం వరకు గ్రామ సభల ద్వారా సామాజిక తనిఖీ కొనసాగిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత ఈ-క్రాప్ తుది ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషనరేట్‌కు పంపుతామని పేర్కొన్నారు. ఈ రబీలో అన్ని పంటలు కలిపి 1,57,465 ఎకరాలలో పంటలు సాగులోకి వచ్చినట్లు ఈ-క్రాప్ ద్వారా స్పష్టమవుతోందని తెలిపారు. ప్రధానంగా మొక్కజొన్న, జొన్న, మినుము, మంచి శనగ, పెసర తదితర పంటలు సాగులోకి వచ్చాయని పేర్కొన్నారు. రైతు భరోసా సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ గ్రామానా ఆదివారం సాయంత్రం వరకు ఈ-క్రాప్ సామాజిక తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు. పొరపాట్లు ఉంటే సవరించుకోవాలని కోరారు. రబీ సీజన్ పంట నమోదులో సవరణ కోసం ఇది చివరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎలాంటి మార్పులు, చేర్పులు చేయబడవని ఆయన రైతులకు సూచించారు.

కార్తికేయునికి వెండి నాగ పడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి నరసరావుపేటకు చెందిన భక్తులు అనుమోలు జగదీష్‌కుమార్ 570 గ్రాములతో చేసిన వెండి నాగపడగను సమర్పించారు. శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న ఆయన వెండి పడగను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం జగదీష్‌కుమార్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 1,39,573 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,21,485 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,39,573 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 20,700 వరకు లభించింది.

మురిపించే పింఛన్

చంద్రబాబు స్వార్థ రాజకీయాలు, అనాలోచిత నిర్ణయాల వల్ల రాజధాని ప్రాంతంలో వేలాది మంది పేదలు ఉపాధి కోల్పోయారు. పేదల ఆందోళన ఫలితంగా పింఛన్ రూ.2,500 ఇచ్చేందుకు అంగీకరించిన టీడీపీ ప్రభుత్వం అందులోనూ వివక్ష చూపింది. తన వారికే వడ్డించింది. ఇటీవల ఫిరంగిపురంలో జరిగిన సభలో పేదల కష్టాలు విన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ రూ.5000లకు పెంచుతూ జీవో విడుదల చేశారు. పెంచిన పింఛన్‌ను శుక్రవారం అందుకున్న పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- రాజధానిలో భూమిలేని నిరుపేదల పింఛన్ పెంపు
- రూ.2500 నుంచి రూ.5000 చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల
- ఫిరంగిపురం సభలో ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- 17,215 మంది భూమిలేని నిరుపేదలకు లబ్ధి
- రాజధాని కూలీల్లో హర్షం



తుళ్లూరులో రాజధాని రైతు కూలీలకు పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

తాడికొండ: గత ప్రభుత్వ హయాంలో భూమిలేని నిరుపేదలకు న్యాయం చేయాలని పలుమార్లు రైతు కూలీలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు నాడు పోరాటం చేయగా అరకొరగా చేయి విదిల్చిన చంద్రబాబు రూ.2500 పింఛన్ ఇచ్చేందుకు అంగీకరించారు. 10 సంవత్సరాలుగా దానిని పెంచిన దాఖలాలు లేకపోవడంతో రైతు కూలీలు ఇటు ఉపాధి లేక, అటు ప్రభుత్వం అందించే పింఛన్ చాలక నానా ఇబ్బందులు పడ్డారు. పింఛన్ సొమ్ము రూ.2500ను రూ.5000లకు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం నుంచి పెంచిన పింఛన్ సొమ్ము చెల్లించనున్న నేపథ్యంలో తమకు ఆర్థిక బాధలు తొలగనున్నాయని వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతు కూలీలు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీని వలన రాజధాని 29 గ్రామాల్లో భూమిలేని నిరుపేద కుటుంబాలకు చెందిన 17215 కుటుంబాలు లబ్ధి పొందనున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు అందించే జీవన భృతి పింఛన్లు చాలడం లేదని, వారికి రూ.5000 అందించాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సభలో కోరగా స్పందించిన సీఎం వెంటనే ఆ హామీ నెరవేర్చుతున్నట్లు సభలో ప్రకటించారు. 15 రోజుల్లోనే హామీని నెరవేర్చి రాజధాని ప్రాంతంలో నిరుపేద కుటుంబాల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. తమకు మేలు చేసిన జగనన్నకు జేజేలు పలుకుతున్నారు. తాడికొండ నియోజకవర్గంలోని తుళ్లూరులో శుక్రవారం నిర్వహించిన సభలో రైతు కూలీలకు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని నిడమర్రు, యర్రబాలెంలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, సమన్వయకర్త గంజి చిరంజీవి పింఛన్ నగదు అందజేశారు.



నిడమర్రులో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా రైతు కూలీలు

టీడీపీ హయాంలో ఒక్కొక్కరికి ఓ న్యాయం



తెలుగుదేశం పార్టీ హయాంలో పేదలకో న్యాయం, పెత్తందారులకో మరో న్యాయం జరిగింది. రైతులకు, అసైన్డ్ రైతులకో ప్యాకేజీ ఇచ్చి వ్యవసాయ కూలీలను మాత్రం నిలువునా మోసం చేశాడు. ఇక్కడ ఉపాధి లేక పనుల కోసం పక్క ప్రాంతాలకు వలస వెళ్లి కడుపు నింపుకున్నాం. మాకిచ్చిన జీవన భృతి పింఛన్ కూడా అప్పటి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకొస్తే గానీ ఇవ్వలేదు.

– పఠాన్ చాంద్ బీ, మందడం

జగనన్నకు ధన్యవాదాలు



రైతులతోపాటు జీవన భృతి పింఛన్ కూడా పెంచుతూ పోతే మాకు కూడా లబ్ధి జరిగేది కానీ బాబు మాత్రం తమ సామాజిక వర్గానికి మాత్రమే లబ్ధి చేకూర్చి మాలాంటి పేదలకు మాత్రం అరకొరగా ఎంగిలి చేతిని విదిలించి మోసం చేశాడు. మాకు మేలు చేసేలా పింఛన్ రూ.5000 చేసిన జగనన్నకు ధన్యవాదాలు

– పఠాన్ నాగుల్ బీ, మందడం

బాబు పేదల ఉసురు పోసుకున్నారు



అమరావతి పేరుతో అభివృద్ధి చేస్తానని చెప్పిన చంద్రబాబు ఈ ప్రాంతంలో మూడు పంటలు పండే భూములు తీసుకోవడంతో అడవిలా మారింది. ఉపాధి లేకుండా చేసిన కారణంగా మాకు జీవనం నానా ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు జగనన్న రూ.5000కు పెంచి మాకు మేలు చేశాడు. బాబు చేసిన నిర్వాహకం కారణంగా పడ్డ పాట్లు అంతా ఇంతా కాదు అభివృద్ధి చేయకపోగా అడవిలా మార్చి మా ఉసురు పోసుకున్నారు.

– చలివేంద్రం లక్ష్మి, వెలగపూడి

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

బాపట్లటౌన్: ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంతవరకు తనిఖీ బృందాలు తమ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశాయి. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే ముందు పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం, సాయిబాబా మందిరం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, పోలేరమ్మగుడి, సోమేశ్వర స్వామి దేవాలయాలు విద్యార్థులతో కిటకిటలాడాయి. పరీక్షకు గంటముందుగానే విద్యార్థులు ఆయా కళాశాలలకు చేరుకున్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆయా కళాశాలల యాజమాన్యం ముందస్తుగా అన్ని రకాల చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద హెల్త్ సూపర్‌వైజర్లు, తాగునీరు అందుబాటులో ఉంచారు. జిల్లాలో మొత్తం 9548 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 513 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా

జిల్లాలో పరీక్షలు జరిగే 35 కేంద్రాల వద్ద ఎస్పీ వకుల్‌జిందాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంతవరకు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుపరిశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వాచ్‌లు, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్పీ వకుల్‌జిందాల్ తన సిబ్బందితో స్వయంగా పరీక్ష కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన వారిలో ఎస్బీ సీఐ వి.మల్లికార్జునరావు, బాపట్ల పట్టణ సీఐ శ్రీనివాసులు, జిల్లా ఇంటర్ విద్యా అధికారి పాదిలి యర్రయ్య పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.5800, గరిష్ఠ ధర రూ.7100, మోడల్ ధర రూ.6400 వరకు పలికింది.

రైల్వే ప్రయాణికులకు ఊరట

- తగ్గిన రైల్వే చార్జీలు
- పేదోళ్ల రైలు ప్రయాణానికి వెసులుబాటు
- మూడు ప్యాసింజర్ రైళ్లకు వర్తింపు



ప్యాసింజర్ రైలు

వేటపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు మూడేళ్ల తరువాత పేద రైలు ప్రయాణికులకు ఊరట కలిగించింది. దేశంలో మొదటిసారి కరోనా విజృంభించిన సమయంలో రైల్వేశాఖ ప్రజా రవాణా విషయంలో నిబంధనలు కఠినతరం చేసింది. ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసింది. మరికొన్ని నెలలపాటు అతి తక్కువగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడిపింది. ఈక్రమంలో ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్పు చేసి చార్జీలను పెంచింది. అనంతరం ఇప్పుడు ఎన్నికల వేళ ఎట్టకేలకు రైల్వేశాఖ ప్యాసింజర్ రైళ్ల చార్జీలు తగ్గించి పేదవాడి ప్రయాణానికి లాభం కలిగించింది.

ప్యాసింజర్ రైళ్లు ఇవే..

కరోనాకూ పూర్వం ఉన్న ప్యాసింజర్ రైళ్ల నంబర్లు మార్పు చేసింది. ప్రస్తుతం '0' తో ప్రారంభమయ్యే ప్యాసింజర్ రైళ్లకు మాత్రమే వర్తిస్తాయి. నెంబరు ముందు '1' తో ప్రారంభమయ్యే రైళ్లకు తగ్గించిన చార్జీలు వర్తించవు. విజయవాడ-ఒంగోలు (07451), విజయవాడ-బిట్రగుంట (07978), విజయవాడ- గూడూరు (07500), బిట్రగుంట-విజయవాడ (07977), గూడూరు-విజయవాడ (07458), ఒంగోలు- విజయవాడ (07576) రైళ్లకు మాత్రమే తగ్గించిన చార్జీలు వర్తిస్తాయి.

రూ.30 టికెట్ ధర ఇకపై రూ.10 కే..

ప్యాసింజర్ ప్రయాణించే వారికి కనీస చార్జీని రూ.10కి తగ్గించారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత నెల 27 నుంచి అమలులోకి తీసుకొచ్చింది. కరోనా కాలంలో సదరు చార్జీని రూ.30కి పెంచారు. రైల్వే శాఖ తాజా నిర్ణయంతో లక్షలాది మంది పేద ప్రయాణికులపై భారం తగ్గనుంది. కనీస చార్జీని భారతీయ రైల్వేకి సంబంధించి క్రిస్‌లో ఫీడింగ్ చేశారు.

చీరాల నుంచి రైల్వే చార్జీల వివరాలు..

స్టేషన్ నుంచి	వరకు	కొత్తచార్జి
చీరాల	ఒంగోలు	రూ. 10
చీరాల	కావలి	రూ. 25
చీరాల	సింగరాయకొండ	రూ. 20
చీరాల	టంగుటూరు	రూ.20
చీరాల	నెల్లూరు	రూ.35
చీరాల	గూడూరు	రూ. 45
చీరాల	అప్పికట్ల	రూ. 10
చీరాల	చుండూరు	రూ. 15
చీరాల	తెనాలి	రూ.20
చీరాల	విజయవాడ	రూ.25

చార్జీలు తగ్గించడం సంతోషంగా ఉంది..

రైల్వే చార్జీలు తగ్గించడం సంతోషంగా ఉంది. ప్రతిరోజూ విజయవాడ వెళ్లి సరుకులు తెచ్చుకొని వేటపాలెంలో విక్రయించుకొంటాను. విజయవాడ వెళ్లడానికి చార్జీకి సగం డబ్బులు ఖర్చు అయ్యేది. ఇప్పుడు చార్జీలు తగ్గించడం వల్ల సంతోషంగా ఉంది.

– వెంకటేశ్వర్లు, వ్యాపారి, వేటపాలెం

రూ.10 చేయడం వల్ల ఎంతో లాభం..

నేను ప్రతి రోజూ ఒంగోలు ప్రాంతంలో బేల్దారి పనులకు వెళ్తాను. ఒంగోలు వెళ్లి రావడానికి ప్రతి రోజూ చార్జీలకు రూ.60 ఖర్చు అయ్యేది. ఇప్పుడు చార్జీలు తగ్గించిన తరువాత కేవలం రానుపోను రూ.20తో సరిపోతుంది. ప్రతి రోజూ రూ.40 మిగులుతుంది.

– గోవిందమ్మ, కూలి, వేటపాలెం

పేదరికం పోవాలంటే చదువే ఏకైక మార్గం



చెక్కు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

- జిల్లా రంజిత్ బాషా
- విద్యా దీవెన నిధులు విడుదల

బాపట్ల: పేదరికం నుంచి బయటపడాలంటే చదువే ఏకైక మార్గమని గట్టిగా నమ్ముతున్న రాష్ట్ర ప్రభుత్వం పేదింటి పిల్లల ఉన్నత విద్య కలలను నిజం చేస్తూ జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం 2023-24 త్రైమాసికానికి సంబంధించిన విద్యా దీవెన నిధులను విద్యార్థులు, తల్లుల సంయుక్త ఖాతాలో నేరుగా జమ చేసే కార్యక్రమాన్ని కృష్ణా జిల్లా పామర్రులో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా, బాపట్ల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష, జాయింట్ కలెక్టర్ సి హెచ్ శ్రీధర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లా లోని ఎస్సి, ఎస్టీ, బిసి, ఇ బి సి, ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ మరియు కాపు వర్గాలకు చెందిన 29402 మంది విద్యార్థులకు సంబంధించిన 24 కోట్ల 82 లక్షల రూపాయలను విద్యార్థులు, తల్లుల సంయుక్త ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు విద్యారంగంలో వెచ్చించి పలు విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ప్రపంచంతో పోటీ పడి చదువుకుని తమ తర్వాతి తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అర్జున్‌రావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి జె రాజ్‌దెబోరా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రకాశం, వివిధ కాలేజీల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ కృషి

- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం
- పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్త బాలాజీ, మాజీ మంత్రి గాదె



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, సమన్వయకర్త బాలాజీ

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం కృషి చేస్తున్నారని పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. మండలంలోని పావులూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.47 లక్షలతో నిర్మాణం చేసిన పెట్రోలు బంకు, గోడౌను, రూ.44 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన పావులూరు గ్రామ సచివాలయం-2 భవనం, రూ.24 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన రైతు భరోసా కేంద్రం, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందించేందుకు తాను ముందుంటానని, నియోజకవర్గ ప్రజలు తనను సొంత వ్యక్తిగా ఆదరించి మీలో ఒకడిగా తనను చూసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికలలో పర్చూరు నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, గాదె మధుసూదన రెడ్డి, జిల్లా పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులఖండం రామకృష్ణారెడ్డి, ఎంపీపీ బండారు అనూషరాజకుమార్, మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, గ్రామ సర్పంచ్ లుధియమ్మ, ఎంపీటీసీ వలేరు చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ బట్టు శంకరరావు, మాజీ సర్పంచ్ పులఖండం బద్రిరెడ్డి, వెంకారెడ్డి, సింహాద్రి సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, నాగండ్ల సర్పంచ్ కే పద్మావతి, నక్కలపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు, వేజండ్ల సైమన్, సుబ్బారెడ్డి పాలెం సర్పంచ్ భవనం సురేష్‌రెడ్డి, అడపా సుధాకరరెడ్డి, గంగవరం పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, భీమవరం పీఏసీఎస్ చైర్మన్ పాటిబండ్ల గోపి, ఇంకొల్లు వైస్ సర్పంచ్ మహ్మద్ లతీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించేందుకు జిల్లా ప్రజా పరిషత్ నిధులు విడుదల చేసింది. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సూచనలతో రూ.61,20,225 నిధులు మంజూరు చేస్తూ జెడ్పీ సీఈవో ఎస్‌ఎస్వీబీ వసంత రాయుడు గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. గతేడాది గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 25వేల మంది జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.50 లక్షల జెడ్పీ నిధులతో నెలరోజుల పాటు అల్పాహారాన్ని అందజేయగా, ప్రస్తుత విద్యాసంవత్సరంలో 27,201మంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు రూ.61.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. జనవరి 30న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. నిధులను ఆయా జిల్లాల వారీగా డీఈవోలకు అందజేయనున్నారు. విద్యాశాఖాధికారుల ద్వారా జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు జమ చేయించి, ప్రతి రోజూ అల్పాహారాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టారు. విద్యార్థులకు మేలు జరుగుతుందని అంటున్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన అవసరం

డీఎంహెచ్‌ఓ విజయమ్మ



ప్రచార ప్రదర్శను ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి ఎస్.విజయమ్మ

బాపట్ల :పల్స్‌పోలియోపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా పల్స్‌పోలియోపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ ఈనెల మూడో తేదీ నుంచి 0-5సంవత్సరాల పిల్లలకు పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు చుక్కలు చిన్నారుల జీవితాలకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, మలేరియా అధికారి వై.రాజకుమార్, డాక్టర్ సౌజన్య, జ్యోగుంట రాంబాబు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: గుంటూరు ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే క్రమంలో పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్రెయిన్ మీదుగా వెళ్లే పైపులైన్లు పక్కకు మార్చడంతోపాటు లీకులకు మరమ్మతులు చేస్తున్నామన్నారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలు వాంతులు, విరేచనాల లక్షణాలతో అస్వస్థతకు గురవుతున్న ప్రాంతాపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరిస్తున్నామన్నారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, పరిస్థితులు పూర్తిగా అదుపులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని యువకుడి మృతి

ఇంకొల్లు (చినగంజాం): పొట్టకూటి కోసం పరాయి రాష్ట్రం వచ్చిన ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈఘటన ఇంకొల్లు పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ బత్తుల శ్రీనివాసరావు అందించిన వివరాలు.. బిహార్ రాష్ట్రం మాధేపుర జిల్లా సల్మాతుల్లి గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్(25) ఇంకొల్లు ప్రాంతంలో కోల్డ్‌స్టోరేజ్‌లు రిపేరు చేస్తూ జీవనం చేస్తున్నాడు. ఇంకొల్లు కొణికి రోడ్డులో అప్పేరు వాగు వంతెనపై అతడిని గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు..



ఇంకొల్లు(చినగంజాం): గడ్డి ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన ఇంకొల్లు మండలంలోని గంగవరం రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. మార్టూరు మండలం కోలలపూడికి చెందిన సూరగాని సుబ్బారావు(73) ప్రతిరోజు తన టీవీఎస్ ద్విచక్రవాహనంపై చీపుర్లు పెట్టుకొని చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. ఇంకొల్లు గంగవరం రోడ్డు సమీపంలో గడ్డి ట్రాక్టర్‌ను టీవీఎస్ వాహనం ఢీకొట్టడంతో సుబ్బారావు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


నక్కల దాడిలో ఎనుబోతు మృతి

బొల్లాపల్లి: నక్కల దాడిలో ఎనుబోతు తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన మండల కేంద్ర సమీపంలోని బండ్లమోటు సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై అటవీ శాఖ బొల్లాపల్లి సెక్షన్ అధికారి ఎం.సురేంద్ర వివరణిస్తూ.. నక్కలదాడిలో మనుబోతు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు చెప్పారు. బండ్లమోటు పోలీసులు ఘటన ప్రాంతానికి చెరుకుని వన్యప్రాణి మృత దేహాన్ని పరిశీలించారు. పశు సంవర్ధక వైద్యులు పంచనామా నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది అటవీ ప్రాంతంలో కళేబరాన్ని ఖననం చేసినట్లు బీట్ అధికారి తెలిపారు.

రాజధాని గ్రామాల్లో కూలీల ఆనందం



తెల్లవారుజామున రాజధాని రైతు కూలీల పెన్షన్ అందజేస్తున్న వలంటీర్



పెనుమాకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, రైతు కూలీలు

- తెల్లవారుజామునే రూ.5 వేల చొప్పున పింఛన్ అందజేత
- పలుచోట్ల సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాడేపల్లిరూరల్: భూమిని, రైతుని లేకుండా చేసి పెత్తందారులకు దోచిపెట్టేందుకు చంద్రబాబు కుట్ర చేశాడు. పేదలకు పని లేకుండా చేశాడు. పనికోసం పాకులాడిల్సిన దుస్థితి కల్పించాడు. కానీ వారందరికీ నేనున్నానంటూ.. అండగా నిలిచారు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. బాబు పాలనలో అన్యాయానికి గురైన పేదలకు మాట ఇచ్చి మడమతిప్పని మహోద్యమకారుడిగా వైఎస్ జగన్ నిలిచారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫిరంగిపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజధాని రైతు కూలీల పెన్షన్‌ను మార్చి ఒకటో తేదీ నుంచి ఐదు వేల రూపాయలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అయన హామీ ఇచ్చిన విధంగా శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే రాజధాని పరిధిలో రైతు కూలీలకు ఇస్తున్న రూ.2,500 పెన్షన్‌కు బదులుగా రూ.5 వేలు పింఛన్‌ను వలంటీర్లు అందజేశారు. తాడేపల్లి రూరల్‌పరిధిలో ఉండవల్లి, పెనుమాక ప్రాంతాలు అప్పట్లో రాజధాని ప్రాంతంగా నిర్ణయించారు. పెనుమాకలో 1456, ఉండవల్లిలో 1404 మంది రైతుల కూలీల సామాజిక పెన్షన్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు సామాజిక పెన్షన్లతో పాటు రైతు కూలీల పెన్షన్లు కూడా తెల్లవారుజామున అందజేశారు. పెనుమాక, ఉండవల్లిలో రూ.71,50,000 పింఛన్ కింద ఇస్తుండగా ప్రస్తుతం పెరిగిన దానితో రూ.1,43,00,000 అందజేస్తున్నారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పెనుమాకలో ఎస్సీ కాలనీ, కొత్తూరు సెంటర్, ఉండవల్లి ఎస్సీ కాలనీ, ఉండవల్లి లొద్దు, ఉండవల్లి సెంటర్ తదితర ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షుడు మేకా దామేశ్వర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్క ప్రసన్న(నాని), భవనం రవీంద్ర రెడ్డి, సచివాలయ కన్వీనర్లు షేక్ బషీర్,పులి భుజంగరావు, విలియం, ఆనందరావు, రవి పాల్గొన్నారు.

రైతు కూలీలకు న్యాయం



రాజధాని ప్రాంతంలో మాకు న్యాయం జరిగింది. గతంలో రూ.2500 ఇచ్చేవారు. ఆరు నెలలకు ఒక సారి 3 నెలలకు ఒకసారో బ్యాంక్ ఖాతాలో నగదు జమ అయ్యేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రాజధాని కూలీల పెన్షన్లు అలాగే ఇచ్చేవారు. 2023 జనవరి నుంచి స్థానిక ఎమ్మెల్యే ఆర్కే చొరవ వల్ల వలంటీర్లే ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ.ఐదు వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది.

–ఎస్‌కే షాహీరా బేగం

వైఎస్సార్ లానే పేదల పక్షాన



దివంగత నేత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి లాగానే ఆయన కొడుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలు, మహిళల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటివద్దకే పెన్షన్లు అందజేస్తున్నారు. జగన్ బాబు ముఖ్యమంత్రి అయిన తరువాత రాజధాని కూలీల పెన్షన్ల కోసం గతంలో లాగా ఇబ్బంది పడడం లేదు. వలంటీర్లు ఇంటికే తీసుకొచ్చి ఇస్తున్నారు. ఆయన చెప్పిన విధంగా ఈ నెల నుంచి 5 వేల రూపాయలు పెన్షన్ ఇచ్చారు.

–షేక్ హుస్సేన్ బీ

మాట నిలబెట్టుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. వలంటీర్ ఇటీవల వచ్చి రాజధాని కూలీలకు పింఛన్ పెంచారని చెప్పగానే కొంచెం ఆనందం వేసింది. ఇస్తారా ఇవ్వరా అని అనుమానంగా ఉండేది. అయితే సీఎం చెప్పిన విధంగానే తెల్లవారుజామునే వచ్చి పింఛన్ రూ.5 వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది.

–షేక్ ఖాసిం బీ

ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాలు అందించాలి

–జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

చీరాల టౌన్: ప్రభుత్వం రైతుల కోసం అందించే ప్రతి పథకం రైతులకు చేరాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పేర్కొన్నారు. చీరాల వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం వద్ద రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులతో శుక్రవారం సమావేశం అయ్యారు. అలానే గవినివారిపాలెం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతుభరోసా కేంద్రంలో రబీ సీజన్‌కు కేటాయించిన ఎరువులు, అమ్మకాలు, నిల్వలు, కియోస్క్‌లో రైతులకు అందిస్తున్న సేవలు, ప్రయోజనాలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగుల మందులు, పంటల దిగుబడులు పెంచేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల్లో పనిచేసే సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. పండించే ప్రతి పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేయడంతో పాటుగా సోషల్ ఆడిట్ చేసి ఆజాబితాలను ప్రతీ ఆర్‌బీకేలో ప్రదర్శన చేయాలన్నారు. ఆర్‌బీకే ఉద్యోగులు, వ్యవసాయాధికారులు రైతుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో చీరాల ఏడీఏ ఎఫ్రాయం, ఏఓ సుమతీ, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా భాస్కరరావు

గుంటూరు మెడికల్: గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఏపీ గుంటూరు మెడికల్ కాలేజీ అధ్యక్షుడిగా జీజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ చందా భాస్కరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు శుక్రవారం నూతనంగా ఎన్నికైన డాక్టర్స్ అసోసియేషన్ నేతలు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలిసి నూతన కమిటీ వివరాలను అందజేశారు. జనరల్ సెక్రటరీగా జీజీహెచ్ ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.స్వరూప్‌కాంత్, కోశాధికారిగా ఎనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఇందిరప్రియదర్శిని ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్స్‌గా ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్, సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగసంతోష్‌కుమార్, సివిల్ అసిస్టెంట్ సర్జర్ జ్యోతుల మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ సి.వాసవి, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ పి.రాజ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ కె.సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వైద్యులు పి.ఎస్.ఉషారాణి, పి.తబిత, ఆర్.జె.చంద్రిక, పి.నందకుమార్, పి.సుధారాణి, క్రీస్తు దాస్, కె.మాధవి, వై.రవీంద్రకుమార్, వి.శివరామ్‌ప్రసాద్, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు, జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ వి.రంగారెడ్డి, బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సి.హెచ్.భానుకుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి.శైలజ, ఎన్నికల సెంట్రల్ అబ్జర్వర్ ఐ.బాబ్జి శ్యామ్‌కుమార్‌లు నూతనంగా ఎన్నికైన వైద్యుల కమిటీని అధికారులకు పరిచయం చేసి అభినందనలు తెలిపారు.

ఐఎఫ్‌పీ ప్యానెల్స్ వినియోగంపై అవగాహన

గుంటూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌లో రిమోట్ మేనేజ్మెంట్ సాఫ్ట్ వేర్‌ను ఇన్స్టాల్ చేసేందుకు నూతన రిమోట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 252 పాఠశాలల్లో 1299 ఐఎఫ్‌పీ ప్యానల్స్, 178 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిలో నూతనంగా వస్తున్న రిమోట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్(ఆర్ఎంఎస్)ఇన్‌స్టాల్ చేసి ఉపాధ్యాయులకు నూతన సాఫ్ట్‌వేర్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఉపయోగించి డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి బోధన చేయాలని సూచించారు. దీని ద్వారా బోధన సులభతరం అవుతుందని, విద్యార్థులు కూడా సులభంగా అర్థం చేసుకోగలుగుతారన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.8 కోట్లతో మండలంలోని గంగడిపాలెం పంచాయతీ మృత్యుంజయపాలెంలో శుక్రవారం నిర్వహించిన తాగునీటి పథకం ప్రధాన పైపులైన్‌ల శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పథకం పనులు పూర్తయితే 12 పంచాయతీలలోని వివిధ గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు ఇంటింటికి చేరుతుందన్నారు. గతంలో ఉన్న మృత్యుంజయపాలెం తాగునీటి పథకం ద్వారా అందుతున్న గ్రామాలకు మరింత ఎక్కువగా సరఫరా చేసే అవకాశం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, మండల ఉపాధ్యక్షుడు పీతా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తలశిల శ్రీనివాసరావు, తిరుమలశెట్టి శివాజీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పార్టీ సమన్వయకర్త వెంకటేష్



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్

వేటపాలెం: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రసాద్‌నగర్‌లో మహిళా సంఘాలు ఏర్పాటు ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. అయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ చేసి వారిని ఆదుకున్నారని గుర్తు చేశారు. ప్రతి పథకం మహిళల పేరు పైనే ఇచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకోవడానికి మహిళలు పూర్తి సహకారం అందించాలని కోరారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక చేయూత, స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి ఆస్తి పత్రాలు అందించడం చారిత్రాత్మకమన్నారు. దేశ చరిత్రలో ఎవరూ చేయలేని విధంగా గొప్ప పథకాలను అందించిన జగనన్నకు అందరం సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు మనమందం ప్రచారం చేయాలని వెంకటేష్ కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివారావు, కో ఆప్షన్ షేక్ కబీర్, శర్మ, పాకల శ్రీను, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

చీరాల అర్బన్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చీరాల మండలంలో మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి పరీక్ష తెలుగు, సంస్కృతం నిర్వహించారు. పట్టణంలోని శ్రీమేధావి, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, విజ్ఞాన భారతి, ఏకేపీ, వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కళాశాల, విద్య కాలేజీ, బీబీహెచ్ కాలేజీ పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం విద్యార్థులతో సందడి నెలకొంది. విద్యార్థులు చివరి నిమిషంలో ఉరుకులు పరుగులు పడుతూ పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పరీక్షకు అరగంట ముందుగా పరీక్షకేంద్రానికి రావాలని అధికారులు సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. పరీక్షలు ప్రారంభరోజు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్రాల వద్దకు వచ్చి దగ్గరుండి వారిని లోపలికి పంపించారు. ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్ష రాయాలంటూ వారి పిల్లలకు సూచించారు. పరీక్ష అయ్యేవరకు బయటనే వేచిఉన్నారు. అలానే ప్రైవేటు కాలేజీలు ఆయా పరీక్ష కేంద్రాలకు బస్సుల ద్వారా విద్యార్థులను తీసుకువచ్చారు. కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించారు.

జయం మనదే



పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ రథ సారథిగా గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి వెంకట రోశయ్య అర్జునుడిగా ఎన్నికల కురుక్షేత్రంలో అడుగు పెట్టబోతున్నారు. తమ అమ్ములపొది నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన నవరత్న పథకాలను గెలుపు బాణాలుగా సంధించేందుకు 'సిద్ధం'అయ్యారు. ప్రసన్నాంజనేయుని నిండు ఆశీస్సులతో మరోసారి పొన్నూరు కోటలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు ఇప్పటి నుంచే 'వ్యూహం' పన్నుతున్నారు. గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త రోశయ్యను శుక్రవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెదకాకాని మల్లేశ్వరుని సాక్షిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను పొన్నూరు గడపకు తోరణంగా కట్టేందుకు 'సిద్ధం'అయ్యారు. అంబటి మురళీకృష్ణను అక్కడ ఎమ్మెల్యేగా ప్రజలతో మమేకమైన కిలారి రోశయ్య భుజంతట్టి ప్రోత్సహించారు. జయం మనదే అంటూ మీడియా ఎదుట విజయ సారథులుగా కనిపించారు.

– పొన్నూరు

ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- మృతుల్లో చిన్నారి సహా ఇద్దరు మహిళలు
- ఓవర్‌టేక్ చేయబోతూ ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు



ఘటనా స్థలిలో మృతి చెందిన పావని, శ్యామ్

గుంటూరురూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడిన ఘటన గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు గార్లపాటి శ్రీను నల్లపాడు పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగరం గండాలయ్యపేటకు చెందిన గార్లపాటి సుబ్బమ్మ, ఆమె తోడు కోడళ్ల గార్లపాటి నాగలక్ష్మి, గార్లపాటి రాధ, నాగలక్ష్మి కుమార్తె గార్లపాటి పావని, సుబ్బమ్మ మనవడు గార్లపాటి శ్యాంబాబు పిడుగురాళ్ల మండలం జూలకల్లులో బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం గురువారం కారులో బయల్దేరి వెళ్లారు. కారును డ్రైవర్ శ్రీకాంత్ నడుపుతున్నాడు. శుభకార్యం ముగిసిన అనంతరం రాత్రి పది గంటల సమయంలో జూలకల్లు నుంచి మంగళగిరికి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో అర్ధరాత్రి దాటుతుండగా ఎస్‌హెచ్–16లో బొంతపాడు వద్ద ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ శ్రీకాంత్ ఓవర్ టేక్ చేయబోయాడు. అనుకోకుండా మితిమీరిన వేగంతో ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో గార్లపాటి పావని (17), గార్లపాటి సుబ్బమ్మ(48), గార్లపాటి శ్యామ్(8) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనలో డ్రైవర్ శ్రీకాంత్‌తో పాటు మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ నిసార్‌బాషా, పోలీసులు మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి, బంధువులకు సమాచారమిచ్చారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృత్యువాతకు గురవ్వడంతో గండాలయపేటలో విషాదచాయలు అలముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నల్లపాడు సీఐ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు